కథ

# మహావృక్షాలు

జయంతి పాపారావు




"ఒద్దు బాబూ! నానుచ్చుకోను. అర్థరూపాయకాదు, రూపాయకాదు, అయిదొందలిచ్చినా నానుచ్చుకోను. అంతే! నా మాట ఇను. పట్నం ఎల్లిపోతన్నావు. అక్కిడ పైసానేందే పిట్టకూడా కూయదంత! ఆ కాసు నీకెంతో పనికొత్తాది. నానుచ్చుకోను. ఇక్కిడ మాకు గెంజినీళ్లతో గడిసిపోద్ది. అక్కిడ నీకలగవుద్దేటి? మీ యమ్మానాన్నా గురిచ్చి బెంగడిపోమాక! అల్లని మాం కంటిపాపల్లా సూసుకుంతాం. వూరంతా, మావంతా వున్నాం కదేటి! బేజారు పడబోమాక!... నానుచ్చుకోను ... అంతే!" అని కంటతడితో కన్నమ్మ అప్పుడు, ఆనాడు, ఒకనాడు అన్నమాటలు నా గుండెల్ని వదిలిపెట్టేసి ఎప్పుడూ బయటకు వెళ్లిపోలేదు. మా తాత చావుని మర్చిపోగలిగేను. మా నాయనమ్మ చావుని మర్చిపోగలిగేను. మా అమ్మమ్మ చావుని మర్చిపోగలిగేను. మా తల్లిదండ్రుల చావుని మర్చిపోగలిగేను. అయితే కన్నమ్మ కంటతడి మాటలు మర్చిపోలేకపోయాను. మర్చిపోలేకపోతున్నాను!

నేనెందుకు ఆమె మాటలు మర్చిపోలేకపోతున్నాను? చాలాసార్లు ఆ ప్రశ్న వేసుకున్నాను. జవాబు నేను తెలుసుకున్నాను. మానవ బలహీనతలవల్ల కానీ, మానసిక బలహీనతలవల్ల కానీ నేను మర్చిపోలేకపోతున్నానని నేను చెప్పజాలను. ఎందుకంటే అవేవీ అటువంటివేవీ దానికి కారణం కాదు.

మరైతే ఏది కారణం?

ఆమె మాటలు మర్చిపోజాలనట్లే ఆ రోజును కూడా మర్చిపోజాలను. అది నా జీవితాన్ని మలుపు తిప్పినరోజు. ఉద్యోగం దొరికినరోజు. ఉద్యోగంలో కొత్తగా చేరడానికి వెళ్లినరోజు. మావూరుకి నన్ను నేను దూరం చేసుకున్న రోజు. అటువంటి రోజుని నేనెలా మర్చిపోగలను? గ్రామీణ జీవితం నుండి నగర జీవితంలోకి, విద్యార్థి జీవితం నుండి ఉద్యోగ జీవితంలోకి నన్ను ప్రవేశపెట్టిన ఆ రోజుని నేనెలా మర్చిపోగలను?

మా తల్లిదండ్రులు వెళ్లొద్దన్నారు.

"నువ్వెళ్లొద్దు. ఇక్కడే ఉండిపో. ఇక్కడే ఏదో వూళ్లో ఉపాధ్యాయుడిగా ఉద్యోగం చూసుకొని చేరిపో. మనకున్న పదెకరాల గరువులో వ్యవసాయం చేసుకో. మొక్కలను వృక్షాలుగా పెంచినట్లు, పిల్లలను మానవ వృక్షాలుగా చేస్తూ నీ జీవితాన్ని ప్రయోజనకరం చేసుకో. సాటి మానవుల సేవలో నీ జీవితాన్ని ధన్యత చేసుకో. నీ వూరిని నువ్వు బాగుచేసుకో. అభివృద్ధి చేసుకో. ఇదీ నా ధన్యత అని చూపించుకో. నీ జ్ఞానాన్ని నువ్వు ప్రజా ప్రయోజనానికి సద్వినియోగం చేసుకోగలిగనప్పుడే అది జ్ఞానం అవుతుంది. అది నిజమైన జ్ఞానం అవుతుంది. జీవించడానికి డబ్బు కావాలి. నిజానికి అంతవరకే దాని అవసరం వుంటుంది. ప్రజా జీవితానికి హానికరం కాకుండా, దోపిడీ చేయకుండా, కష్టించి శ్రమించి ధనార్జన చేసి సుఖంగా జీవించగలం. అది సాధ్యమైంది. సుఖమైంది. ప్రయోజనకరమైంది. అది నిజమైన నిజజీవితం కాగలదు.

ఉపాధ్యాయుడిగా నేను అయిదో ఆరో మహావృక్షాలను తయారుచేశాను. గర్విస్తున్నాను. మా కొడుకు ముళ్లపొదలా వుంటే మాకు విషాదమే మిగిలిపోతుంది." ఆ విధంగా మా తల్లిదండ్రులు నాకు చాలా చెప్పేరు. నేను చాలా విన్నాను. ఆ మాటలు నేను పట్టించుకోలేదు.

సంస్కరణ జీవన జ్ఞానంలో వారు నిర్మించుకున్న స్వప్నజగత్తు కూలిపోతుందనీ, కూలిపోతోందనీ వారు గుర్తించలేదు. విద్యార్థి జీవితంలోనే నేనది తెలుసుకున్నాను. మా నాన్నగారు గర్వంగా చెప్పుకుంటున్న మానవవృక్షాల నుండే నేను తెలుసుకున్నాను. ఆయన సంస్కరణవు కళ్లు ఆ వృక్షాలను సరిగ్గా చూడలేదు! ఆ మహావృక్షాలు ఎవరికీ నీడనీ, కాయనీ, పండునీ ఇవ్వడంలేదనీ, అవేవీ ఎవరికీ దక్కనీడం లేదనీ, భూసారాన్ని పీల్చేస్తూ బలిసిపోతున్నాయనీ అక్రమణలూ, ఆక్రమణలూ చేస్తూ, విస్తరించి వ్యాపిస్తూ, మరే మొక్కలూ మొలవకుండా, ఎదగకుండా చేస్తూ, ప్రజావిద్రోహ విషవృక్షాల్లా మహా వృక్షాల్లా బలిసిపోతున్నాయనీ నేను గుర్తించగలిగేను.

అటువంటి మహావృక్షాల ప్రభావం నా మీద పడిపోయింది. ప్రజాజీవితం మీద క్రూరంగా భారంగా పడిపోతోంది. సమాజంమీద అవినీతిగా, దోపిడీగా,

నేరంగా, వడిపోతోంది.

నా తల్లిదండ్రుల మాటలు నేను వట్టించుకోలేదు. నగరం వెళ్ళిపోవడానికీ, ఉద్యోగంలో చేరిపోవడానికీ నిశ్చయించుకున్నాను. నా తల్లిదండ్రులను నాతో నగరానికి వచ్చేయమని ప్రార్థించేను. రానన్నారు.

"మాకు వూరుంది. ఊళ్లో చాలామంది పిల్లలున్నారు. వారిని మేం మా పిల్లల్లా చూసుకుంటాం. వారు మమ్మల్ని తల్లిదండ్రుల్లా చూసుకుంటారు. మా ప్రశాంత సుఖజీవినాన్ని పాడుచేసే ప్రయత్నం చేయొద్దు!" అని స్పష్టంగా చెప్పేశారు.

నేను నా నిర్ణయాన్ని మార్చుకోలేదు.

వెళ్లిపోవడానికి పెట్టెలు సర్దుకుని తయారైపోయాను.

మాది చాలా చిన్నవూరు. కాలినడకన మూడుమైళ్లు నడిస్తేనేగానీ బస్సు వెళ్లే రోడ్డు చేరుకోలేం. వడక వడక ఆ ముందురోజు పెద్దవాన వడింది. వూరువూరంతా గరువుల్లోకి వెళ్లిపోయింది. ఎడ్లబండి దొరకదు. పెట్టెలు మోయడానికి మనిషికూడా దొరకదు. నేనొక్కణ్నే పెట్టెల్ని మోయలేను. ఏంచేయాలో ఆలోచిస్తుండగా, కన్నమ్మ వచ్చింది.

నిజానికి నేను వెళ్లిపోతున్నట్లు ఎవరికీ తెలీదు. నేను ఎవరికీ చెప్పలేదు. చెబితే చాలామంది వనులు మానేసి వుండిపోయేవాళ్లు. తెలిస్తే, వెళ్లొద్దని ఒత్తిడి చేస్తారని భయపడి ఎవరికీ చెప్పలేదు.

కన్నమ్మ రెండువూట్లా తిండికూడా లేని చిన్నరైతు కూతురు. పెళ్లయిపోయింది. పిల్లలుకూడా వున్నారు. చిన్నరైతు కుటుంబసభ్యులు వాళ్ల గరువుల్లో వనిలేనప్పుడు, కూలివనికి వెళతారు. ఆమె కూలీగా మా పొలంలోకి వనికి వస్తూ వుండేది.

ఆ సమయంలో ఎందుకొచ్చిందో తెలీదుకానీ, నేను వెళ్లిపోతున్నట్లు గ్రహించింది. నేను అడక్కుండానే వస్తానని చెప్పింది.

నా తల్లిదండ్రుల ఆశీర్వచనం తీసుకున్నాను. వారి కన్నీళ్లు కూడా నన్ను ఆశీర్వదించాయి.

నేను బయల్దేరాను. పెట్టెలు మోస్తూ కన్నమ్మ నావెంట వస్తోంది. ఏదో బాధలో ఒకమైలు నడిచేను. అకస్మాత్తుగా ఒక ఆలోచన నా బుర్రలోకి వచ్చేసింది.

కన్నమ్మకు కూలి ఎంత ఇవ్వాలి? వర్షం వడ్డంవల్ల, వనులు ముమ్మరంగా వుండడంవల్ల వదిరూపాయలు కంటే తక్కువకి ఎవరూ రారు. ఎప్పుడూ కురవని వాన ఆరోజే ఎందుకు కురిసిందో అని వానమీద విరుచుకువడ్డాను. వర్షం లేకపోతే పావలాకూడా ఖర్చుకాకుండా వని జరిగిపోయేది.

కన్నమ్మకు ఎంతివ్వాలి? వనికి వెళ్లకుండా వడున్నదానికి పావలా ఇచ్చినా సరిపోతుంది. పావలాకూడా లేకుండా వడుండం కంటే పావలా సంపాదించుకోగలగడం కన్నమ్మకు లాభమే కదా! అయినా అర్థరూపాయిద్దాం! ఒప్పుకోకపోతే రూపాయిద్దాం! ఇంకా ఒప్పుకోకపోతే, రూపాయన్నరిద్దాం! ఆ విధంగా మూడురూపాయల వరకూ వెళదాం! ఇంకా ఒప్పుకోకపోతే బస్సు రాగానే పెట్టెలు ఎక్కించేసి, బస్సు ఎక్కేసి, కదలగానే మూడురూపాయలు బయటకు విసిరేద్దాం! చచ్చినట్లు అదే తీసుకుంటుంది!

ఆ విధంగా ఆలోచిస్తూ నడుస్తూన్నాను. అలా ఆలోచిస్తున్నంతసేపూ--మహావృక్షాలు--ఆ విధంగా శ్రమదోపిడీయే గాకుండా, అప్పులిచ్చేసి, పంటలు తమకే అమ్మేలా చేసి, పంటలు వండగానే ధరలు వడిపోయేలా చేసేసి, పంటల దోపిడీ, ఆస్తుల దోపిడీ, భూముల దోపిడీ, ఎలాఎలా చేస్తూ ఎలా ఎలా ఎదిగిపోయారో, ఎదిగి బలిసిపోతున్నారో అదంతా నా కళ్లముందు కదుల్తోంది.

రైతుల పంటలు మహావృక్షాల చేతుల్లోకి, వ్యాపారవృక్షాల చేతుల్లోకి, పెట్టిన పెట్టుబడి కూడా తిరిగిరానంత తక్కువ ధరకి వెళ్లిపోగానే, ధరలు ఆకాశాన్నంటుతూ పెరిగిపోవడంవల్ల, ప్రజలు ఎలా దోపిడీ చేయబడుతున్నారో మహావృక్షాలు ఎలా పెరిగిపోయి బలిసిపోతున్నారో అదంతా నా కళ్లముందు కదుల్తోంది.

అటువంటి దోపిడీకీ, దోపిడీదారులకూ, పాలకులూ, రాజకీయనాయకులూ, ఉన్నత ప్రభుత్వ ఉద్యోగులూ ఎలా సహకరిస్తూ వారు కూడా ఆస్తులు పెంచుకుంటూ మహావృక్షాలవుతున్నారో, అదంతా నా కళ్లముందు కదుల్తోంది.

అటువంటి పరిస్థితుల్లో, అటువంటి వ్యవస్థలో నా నిర్ణయం గొప్పదే అని నేను గర్విస్తూ రోడ్డు చేరుకున్నాను!

బస్సు వచ్చేసింది. కన్నమ్మ అర్థరూపాయి కాదు, అయిదొందలిచ్చినా పుచ్చుకోనంది. బస్సు ఎక్కేసి వెళ్లిపోయాను. కన్నమ్మ కంటతడి మాటలు నేనెందుకు మర్చిపోలేకపోతున్నాను?

నా నీచత్వం కానీ, ఆమె ఉన్నతత్వం కానీ కారణాలు కాదు! అయితే, ఆమె మాటలు నేనెందుకు మర్చిపోలేక పోతున్నాను?

000

నాలుగు దశాబ్దాల కాలాన్ని కాలం కర్కశంగా కబళించేసింది. ఆ కాలంలో కొద్దిసార్లు మాత్రమే మావూరు వెళ్లాను.

మా తల్లిదండ్రులు మరణించినప్పుడు వెళ్లాను. ఆ ప్రాంతంలో బ్రాహ్మణ కుటుంబం మరింక ఏదీ లేదని ప్రజలు బాధవడ్డారు.


తరువాత కొంతకాలం పోయాక మళ్లీ వెళ్లాను. కొద్దిగా మిగిలిన భూమిని అమ్మేసుకోడానికి వెళ్లేను. వక్కనున్న పెద్దరైతులు కొంత కలిపేసుకున్నారు. మిగిలిందైనా అమ్మేసుకోడం మంచిదనిపించింది.

ఆ భూమి మరెవ్వరూ కొనకుండా, ఒక మహావృక్షం భయానక వరిస్థితులు సృష్టించింది. అతితక్కువ ధరకు అమ్ముకోవాల్సిన నిస్సహాయ స్థితిలో నన్ను బంధించింది. ఎంతో వచ్చేస్తుందని ఆశించాను. ఎంతో ఎక్కువధరకు కొందామని ఒకరిద్దరు ముందుకు వచ్చినా, వారు భయపడి వెనక్కి తగ్గిపోయారు.

రూపాయి పూర్తిగా పోగొట్టుకోడమూ, పావలా అయినా దక్కించుకోవడమూ అనే నిస్సహాయ స్థితిలో అమ్మేశాను. దోపిడీ ఒక కుట్రగా, కళగా మారిపోయింది! కళలను కూడా దోపిడీకి సహకరించేవిగా చేసుకుంటున్నారు!

ఆ సందర్భంలో బ్రాహ్మణుల చేతుల్లోంచి భూములు బ్రాహ్మణేతర అగ్రకులాలవారి చేతుల్లోకి వెళ్లేవరకే ఎంతోకొంతవరకూ భూసంస్కరణలు జరిగాయనీ, ఆ తర్వాత రాజ్యాధికారం బ్రాహ్మణేతర అగ్రకులాలవారి చేతుల్లోకి వెళ్లేక, వారు ఏదో రూపంలో, ఏదో మార్గంలో భూసంస్కరణలు జరక్కుండా, పేదరైతుల చేతుల్లోకి భూములు వెళ్లకుండా అడ్డుకుంటున్నారనీ, భూసంస్కరణల కోసం పోరాడే ప్రజా ఉద్యమాలను వారు నియంతలుగా నిరంకుశంగా క్రూరంగా పాశవికంగా అణిచివేస్తున్నారనీ ప్రజలు చెప్పుకున్నారు.

ప్రజలే నిజమైన న్యాయమూర్తులు!



ప్రజలే నిజమైన చరిత్రకారులు!

000

నాలుగు దశాబ్దాలు గడిచిపోయాక ఇప్పుడు మళ్ళీ మావూరు వెళ్లేను. పదవీవిరమణ చేసేశాను. తీరిగ్గా వున్నాను. నాకు మా ప్రాంతంలో పాలికగ్రామాలతో పరిచయముంది. అవన్నీ తిరిగి చూస్తున్నాను.

ప్రజలు నాకు చాలా చెబుతున్నారు.

నర్సీపట్నం నుండి విశాఖవెళ్లే బస్సురోడ్డు చేరుకోడానికి రోడ్లు అప్పుడూ లేవు. ఇప్పుడూ లేవు.

ఏదో బడివున్నా చదువులేదు.

వైద్యసదుపాయం లేనేలేదు.

విద్యుత్తు తీగలు అక్కడక్కడ కనిపిస్తున్నా, విద్యుత్తుమాత్రం లేదు.

ఇళ్లమధ్య మురికినీరు నిలిచిపోతోంది. చెత్తలు పేరుకుపోతున్నాయి. దోమలపాటలు వినిపిస్తున్నాయి.

స్త్రీలు, కాలు మడుచుకోడానికీ, స్నానాలు చేయడానికీ సదుపాయాలు లేక చెప్పుకోలేని లైంగికపీడనతో బాధలు పడుతున్నారు.

ఇళ్లు పాతబడిపోయి పడిపోయేలా వున్నాయి. తాటికమ్మలు ఎండిపోయి, ఇంటికప్పులు కూలిపోయేల్లా ఉన్నాయి. వెదుళ్లు పాతబడిపోయి జారిపోతున్నాయి.

ఎక్కడ చూసినా నిరాశా విషాదదృశ్యం కనిపిస్తోంది. నీరులేక ఎండిపోయిన పేదరైతుల భూములూ, పంటలూ, జీవితాలూ, తింటానికి గడ్డిలేని పశువుల కన్నీరూ, మాసిపోయి చిరిగిపోయిన బట్టలూ, చెప్పులు కూడా లేని పాదాలూ, విషాదకరమైన నిరాశా రైతు జీవనదృశ్యం-వల్లెజీవన దృశ్యం కనిపిస్తోంది.

ఒకప్పుడు కూలీలుగా వుండేవాళ్లు, ఇప్పుడు కూలిపనులు దొరక్క, పొట్ట పట్టుకుని ఎక్కడకో వలసపోతున్నారు. చిన్నరైతులు వారి భూములను మహావృక్షాలకు అమ్మేసుకొని కూలీలుగా వారి భూముల్లో వారే పని చేస్తున్నారు.

మధ్యతరగతి రైతులు చిన్నరైతులుగా మారిపోయి, అటుకొద్దిగా సొంత వ్యవసాయం, ఇటు కొంత కూలీపని చేసుకుంటున్నారు.

ఆనాటి నాలుగైదు మహావృక్షాలు, వారి వంశవృక్షం పెరుగుతూ, మహావృక్షాలుగా ఎదిగిపోయారు.

అతి కొద్దిగా నాలుగో, అయిదో కొత్తమొక్కలు బయలుదేరి వృక్షాలుగా, మహావృక్షాలుగా ఎదుగుతున్నారు.

ఆ ప్రాంతం అంతా ప్రజలది కానట్లు, పదిమందిది మాత్రమే అయినట్లు కనిపిస్తోంది.!

ప్రతివూళ్లో ఇద్దరో ముగ్గురో సైకిల్లు పట్టుకొని తిరుగుతున్నారు. వారు మహావృక్షాల అనుయాయులూ, అనుచరులూ, పాలికాపులూ, రౌడీలూ, గూండాలూ, కార్యకర్తలూ ఆ విధంగా వారెవరైనా కాగలరు.

రైతుల పంటలూ, ఆస్తులూ, శ్రమా, ఓటు వంటి వాటిని మహావృక్షాల వేళ్లు పీల్చేసుకోడంతో సహకరించే మధ్యవర్తులుగా వుంటున్నారు. దోపిడీకి సహకరించే దోపిడీ కళాకారులుగా, కార్యకర్తలుగా వుంటున్నారు.

ప్రజలు పరాధీనులుగా, పీడితులుగా, నిస్సహాయులుగా జీవిస్తున్నారు.

వృక్షాలనూ, మహావృక్షాలనూ, మహామహావృక్షాలనూ కలుసుకున్నాను.

వారు స్నేహంగా, ప్రేమగా, గర్వంగా, విజయంగా, వారి ఆస్తులనూ, భవనాలనూ, పట్టణనగరాల్లో వారి ఆస్తులనూ భవనాలనూ పరిశ్రమలనూ, వారి రాజకీయ పదవులనూ పట్టులనూ అన్నీ నాకు చెప్పి, చూపించి, మా ప్రాంతాన్ని వారు ఎలా ఎలా అభివృద్ధి చేశారో చేస్తున్నారో గర్వంగా చూపించి చేప్పేరు. వారి పెద్ద పెద్ద భూముల్లో నీటి సదుపాయాలు ఏర్పరుచుకొని పండిస్తున్న పచ్చని పంటల్ని చూపించేరు.

అదంతా ప్రజల అభివృద్ధిగా వారు గర్వంగా చెప్పుకుంటున్నారు. ప్రచారం చేసుకుంటున్నారు. ఆ విధంగా దేశవిదేశాల్లో భారీగా అప్పులూ, పెట్టుబడులూ, సంపాదించుకుంటూ, వారివారి ఆస్తులూ, భూములూ, పరిశ్రమలూ, ఆధిపత్యాలూ అభివృద్ధి చేసుకుంటూ అదంతా ప్రజల అభివృద్ధిగా ప్రచారం చేసుకుంటున్నారు.

అదంతా ఆ ప్రాంతపు ప్రజలు నాకు చూపించేరు. చెప్పేరు. ప్రజలే నిజమైన న్యాయమూర్తులు! ప్రజలే నిజమైన చరిత్రకారులు!

000

కన్నమ్మ ఇంటిముందు తాటి తడపల కుక్కి మంచం మీద కూర్చున్నాను. మజ్జిగ తాగుతున్నాను.

కన్నమ్మ కూతురు, కాళి గరువులోంచి వస్తోంది. పదోతరగతి చదివి, కూరగాయలు పండిస్తూ, కుటుంబాన్ని పోషిస్తోంది.

నేనెవరో కాళికి తెలీదు!

నన్ను చూసింది. నిప్పులు కురుస్తూ జ్వాలలా నాదగ్గరకు వచ్చేసింది.

"నెగు! నెగి సెల్లిపో! నీ మొగమెలగుందో నీకు తెలుసా!? అద్దవిత్తాను సూసుకో. మా బతుకులు మింగేసే వులినాగుంది. మా బతుకులు కాటేసే పామునాగుంది. నెగు! నెగిసెల్లిపో! ఇంకా మాకాడ మా వూళ్లల్లో ఏదైనా మిగిలి వుందేమో, మింగేద్దావని ఒచ్చినట్లున్నావు! ఏదైనా మిగిలిపోయిందేమో తన్నుకుపోదావని ఒచ్చినట్లున్నావు! నెగు! నెగిసెల్లిపో! నేకపోతే, పీకట్టుకొని వూరి బయట గెడ్డనోకి ఇసిరేత్తాను! సూసుకో! ఆళ్లేరీ!? ఆ బోకరు గోళ్లేరీ? ఆ తారువు గోళ్లేరీ? ఆ సైకిలు గోళ్లేరీ? ఆళ్లని జుత్తట్టుకొని గుంజిగుంజి గుండెలమీద తంతే, నీలాటోళ్లు కాళ్లు తెగిన పచ్చినాగ విలవిల కొట్టుకుంటూ గూకుంతారు!

మా బతుకులు బంగారం సేసేత్తామని సెప్పుగుంతన్నారు. మా బతుకులు బుగ్గి సేసేత్తన్నారు. మీ బతుకుల్లో బంగారం పండించుకుంతన్నారు. నెగు! ఎల్లు!" అని కాళి మహాజ్వాలలా విరుచుకు పడిపోయింది. ఆమెను ఎవరూ అడ్డుకోలేకపోయారు.

000

నా తుదిశ్వాసలో కూడా అటు కన్నమ్మ మాటలూ, ఇటు కాళి మాటలూ మర్చిపోలేను! ఎందుకంటే, వాటిని ఒక చారిత్రక పరిణామం, చరిత్ర, చెబుతున్న మాటల్లా అనుకుంటున్నాను. ఎందుకంటే నిజమైన న్యాయమూర్తులూ, చరిత్రకారులూ ప్రజలే! ఎందుకంటే వ్యక్తి కంటే ప్రజలు, రచన కంటే చరిత్రా ఎప్పుడూ గొప్పవే! ■

